రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (శనివారం సాయంత్రం)
సహర్ 4:53 (ఆదివారం ఉదయం)

ప్రేమ.. పరువు.. హత్య



- కొన్నేళ్ళుగా ప్రేమించుకుంటున్న యువతీయువకుడు
- పలుమార్లు పంచాయితీ
- కులాంతర వివాహం చేసుకుంటే పరువు పోతుందని భావించిన తండ్రి
- అదును చూసి యువకుడి హతం
- ముప్పిరితోట గ్రామంలో విషాదం
- శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో పోలీస్ పికెట్

వారిద్దరిది ఒకే గ్రామం... కులాలు వేరైనా ప్రేమ పేరుతో దగ్గరయ్యారు... విషయం తెలిసిన అమ్మాయి తల్లిదండ్రులు వ్యతిరేకించారు. పద్ధతి మార్చుకోవాలని యువకుడు సాయికుమార్‌ను హెచ్చరించారు... అయినప్పటికీ ఒకరికొకరు కలుస్తుండడంతో పెద్దల మధ్య పంచాయితీ జరిగింది... ఇద్దరు ఇష్టపడుతున్నందున వివాహం చేయాలని ఇరు కుటుంబాలకు చెప్పారు... అప్పటి నుంచి సాయికుమార్ తల్లిదండ్రులతోనూ అమ్మాయి మాట్లాడుతోంది...

ఈ విషయం తెలిసిన బంధువులు వేరే కులస్తుడికి ఇచ్చి వివాహం చేస్తే గ్రామంలో, కులంలో పరువు పోతుందని అమ్మాయి తండ్రితో పేర్కొన్నారు... దీంతో సాయికుమార్‌ను హతమారిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని భావించాడు... అందుకు పక్కా ప్లాన్ వేశాడు... గురువారం సాయికుమార్ పుట్టిన రోజు ఉండగా పథకం ప్రకారం అమ్మాయి తండ్రి యువకుడిపై గొడ్డలితో దాడి చేసి హతమార్చాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో జరిగిన పరువు హత్య సంచలనం సృష్టించింది.

6

పకడ్బందీ ఎన్నికల నిర్వహణకు సలహాలు ఇవ్వాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి ఓటర్ జాబితా సవరణ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణు, జే. అరుణ శ్రీలతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన ఎన్నికల కంటే మెరుగ్గా రానున్న రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు, అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాల పట్ల ప్రతి ఒక్క సిబ్బంది అవగాహన కల్గి ఉండాలన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు గంగయ్య, సురేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన



మంథని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం మంథనిలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. రూ. 4.5 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో ఆర్డీవో ఆఫీసు ఆవరణలో గవర్నమెంట్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. జెడ్పీహెచ్‌ఎస్ రెనోవేషన్ కోసం రూ.30లక్షలతో పనులు ప్రారంభించనున్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణానికి శనివారం ఉదయం మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన, భూమిపూజ చేస్తారని తహసీల్దార్ తెలిపారు. పాత తహసీల్దార్ కార్యాలయం తొలగించి భవనం నిర్మించేందుకు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరుకాగా మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్యాపూర్ గ్రామపంచాయతీ శివారులోని ఆదర్శ పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. అలాగే మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాల ప్రహరీతోపాటు పలు అభివృద్ధి పనులకు రూ.30 లక్షలు మంజూరు కాగా శనివారం మంత్రి శ్రీధర్‌బాబు పనులు ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేయనున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు.



పోతారం వద్ద హైవే నిర్మాణం పనులు



మంథని గోదావరినది తీరంలో బ్రిడ్జి నిర్మాణం పనులు

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు షురూ..

- మంథని తీరంలో బ్రిడ్జి, పోతారం వద్ద హైవే పనులకు శ్రీకారం
- రూ. 125 కోట్లతో శంఖుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- బ్రిడ్జికి నిధులు, ఫారెస్టు క్లియర్స్ కోసం మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక కృషి
- మూడు బ్రిడ్జిలతో రెండు జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా సౌకర్యం
- ఎన్నో ఏళ్ళ బ్రిడ్జి, హైవే నిర్మాణాల కల సాకారమౌతున్న వేళ
- పట్టణంలో పుంజుకోనున్న వ్యాపార, వాణిజ్య వర్గాలు

మంథని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణ శివారులోని గోదావరి నది పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు, మండలంలోని పోతారం గ్రామం నుంచి గోదావరి నది వరకు నేషనల్ గ్రీన్‌ఫీల్డు హైవే పనులు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి-మంచి ర్యాల జిల్లాలను కలుపుతూ మంథని-శివ్వారం మధ్య గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులను మంథని గోదావరి నది శ్మశాన ఘాట్ కింది ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి భూమిని చదును చేసి పనులు ప్రారం భించారు. మట్టి రోడ్డును నిర్మించుకొని పిల్లర్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, కంకర, తదితర సామగ్రి తరలింపు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం గోదావరినదికి వెళ్ళే ప్రధాన రహదారికి అనుసంధానం చేయటానికి రహదారిని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. శివ్వారం అభయారణ్యంలో గోదావరినదిలో ఎల్.మడుగు వన్యప్రాణులు-మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉం డటంతో గోదావరి పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి డిసెంబరులో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చింది. దాదాపు రూ.125 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ బ్రిడ్జికి సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్ 4న శంకుస్థాపన చేశారు.

గోదావరినది పై మూడు బ్రిడ్జిలు..

గోదావరి నది పై ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మంథని మండలం లోని సిరిపురం వద్ద సుందిళ్ళ బ్యారేజీ కం బ్రిడ్జిని నిర్మించారు. మహారాష్ట్ర నుంచి వరంగల్-విజయవాడకు నిర్మిస్తున్న నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా మండలంలోని విలోచవరం శివారులోని గోదావరినది పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. మంథని మండలం కన్నాల, పందులపల్లి, పుట్టపాక గ్రామ శివారుల్లో ఇప్పటికే హైవే వర్క్ ప్రారంభమయ్యాయి. హైవే బ్రిడ్జితో నది పై రెండో వంతెన నిర్మాణం కానుంది. పట్టణ శివారులోని తాజాగా గోదావరినదిపై మూడో భారీ వంతెన నిర్మాణం జరుగుతుంది.

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పనులు

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను మంథని మండలంలోని కన్నాల-పందులపల్లి గ్రామాలతో పాటు పోతారం శివారులో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామ శివారు గోదావరినది నుంచి గ్రామానికి వెళ్ళే రహదారి వరకు దాదాపు

(మిగతా 8వ పేజీలో)

నేషనల్ హైవేతో భూముల ధరలకు రెక్కలు..

జిల్లాలోని మూడు మండలాల పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి అడుగులు పడినప్పటి నుంచి రహదారి మార్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దూకుడు పెంచారు. సమీపంలో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించే పనిలో ఉన్నారు. సాధారణంగా ఎకరాకు రూ.25 నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతుం డగా వ్యాపారులు రూ.కోటి పైగా చెబుతున్నారు. రైతులు సైతం తమ భూములకు డిమాండ్ పెరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు బ్రిడ్జిలతో రవాణా సౌకర్యం

గోదావరి నదిపై అందుబాటులోకి రానున్న మూడు బ్రిడ్జిలతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు పెద్దపల్లి జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. మంథని నియోజకవర్గానికి సరిహద్దుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు, మంచిర్యాల జిల్లాలకు వెళ్ళాలంటే గోదావరినది అడ్డుగా ఉండేది. గోదావరిఖని, కాళేశ్వరం వద్ద మాత్రమే నది దాటడానికి బ్రిడ్జిలు అందుబాటులో ఉండగా ఇటీవల సుందిళ్ల వద్ద మరో బ్రిడ్జి అందు బాటులోకి వచ్చింది. తాజాగా మంథని-శివ్వారం మధ్య గోదావరినది పై వంతెన, నేషనల్ గ్రీన్‌ఫీల్డు హైవేలో భాగంగా విలోచవరం-గోపాల్‌పూర్ గ్రామాల మధ్య మరో వంతెన నిర్మాణం కానుంది. ఈరెండు వంతెనలతో మంచిర్యాల జిల్లాకు, జైపూర్, చెన్నూరుల మీదుగా మహారాష్ట్ర, అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్ళడానికి రవాణా సౌకర్యం మెరుగు పడనుంది.

జనగామ శివాలయానికి నిధులు కేటాయించండి

- ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ వినతి



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోదావరి పరివాహక ప్రాంతం జనగామలో ఉన్న సుప్రసిద్ధ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.6కోట్ల నిధులను కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి రేవంత్‌రెడ్డికి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సింగరేణిలో విజిలెన్స్ ఎంక్వైరీ పేరుతో మారు పేర్లతో ఉన్న డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగ అవకాశం కల్పించాలని, వారు మానసిక వేదనకు గురవుతున్నారని, వారికి సంస్థలో వెంటనే ఉద్యోగాలు ఇప్పించే విధంగా చర్యలుచేట్టాలని కోరారు. రామగుండం ప్రజల చిరకాల కోరిక అయిన 800 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌పనులు ప్రారంభించే విధంగా చూడాలని, ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఆర్టిజన్లను పర్మినెంట్ చేయాలని ఆయన కోరారు.

ఆర్మీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణకు ఎంపికైన యువకులతో కలెక్టర్ శ్రీహర్ష

రామగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ టెస్టులో ఉత్తీర్ణతను సాధించేందుకు అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం సెంటినరీకాలనీలోని రాణిరుద్రమదేవీ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్మెంట్ రాత పరీక్షకు ఆసక్తి కలగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

ఆయన మాట్లాడుతూ అగ్నివీర్ ద్వారా ఇండియన్ ఆర్మీ వింగ్‌లోకి రిక్రూట్‌మెంట్ కోసం నోటిఫికేషన్ విడుదలు కాగా జిల్లాలో అర్హత, ఆసక్తి గల అభ్యర్థులకు రాత పరీక్ష, దేహదారుఢ్య శిక్షణను అందించ ానికి చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి ఆసక్తిగల 359మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. వారికి స్టేడియంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ల పర్యవేక్షణలో రన్నింగ్, మెడికల్, ఇతర ఫిజికల్ టెస్టులు నిర్వహించామన్నారు. అర్హత సాధించిన వారికి 2 నెలల పాటు వసతితో కూడిన శిక్షణ ఇస్తామన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, యువజన క్రీడాధికారి సురేష్, ఏసీపీ రమేష్, మిలట్రీ జవాన్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపికైన యువకులకు సన్మానం

సుల్తానాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): యువత సైనిక విభాగాలలో చేరడానికి శిక్షణ పొందడం గర్వకారణమని సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం శిక్షణకు ఎంపికై యువకులు ఎలవేణి గణేష్, కౌడగాని రాజేశ్, శీలం అభినయ్ వర్మలను సన్మానించారు. పీఈటీలు కల్వల వెంకటేశ్, రాకేష్, ఖేలో ఇండియా కోచ్ గెల్లు మధుకర్, ఆకుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో హిందీ భాష అమలు భేష్

జ్యోతినగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలో రాజ్ భాష హిందీని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. రాజ్‌భాష హిందీ ఆర్గనైజేషన్ సమావేశం శుక్ర వారం ఎన్టీపీసీలో నిర్వహించారు. ఈ సందర్భంగా చందన్ కుమార్ మాట్లాడుతూ ఎన్టీపీసీలో పాలనా వ్యవహారాలు, అధికారిక కార్యక్రమాలలో హిందీ భాషను మరింత విని యోగంలోకి తీసుకువస్తామని, రాజ్‌భాష అమలుకు మరింత ప్రచారం కల్పిస్తామని పేర్కొన్నారు. హిందీ భాషను ప్రోత్సహిస్తున్నందుకు ఇటీవల స్వర్ణశక్తి 2025 అవార్డు రామగుండం ప్రాజెక్టుకు లభించిందన్నారు. ఎన్టీపీసీ ఉద్యో గులు, అధికారులు హిందీ భాషను దైనందిన కార్యక్రమాల్లో వాడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ హెచ్‌ఆర్ జీఎం(హెచ్‌ఓడీ) ఎస్‌ఎన్. పాణి గ్రహి మాట్లాడుతూ ఎన్టీపీసీ సంస్థ దక్షిణ రీజియన్ పరిధి లో అన్ని ప్రాజెక్టుల్లో హిందీ భాష అమలుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాజ్‌భాష ప్రత్యేక సంచిక 2024-25ను అధికారులు విడుదల చేశారు. సమావేశంలో రాజ్‌భాష విభాగం ముఖ్యాధికారి(ఢిల్లీ) అతర్ సింగ్ గౌతం, ఎన్టీపీసీ జీఎంలు ఎఆర్.దాస్, కె.సి.సంగరాయ, అధికారులు పాల్గొన్నారు.



హిందీ ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్న అధికారులు

రైస్‌మిల్లులలో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

- 31675.47 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో తేడా
- అధికారులతో యజమాని వాగ్వాదం

7

రైతు సంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

పెద్దపల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతు సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధించిన రైతు సంఘాల నాయకులను విడుదల చేయాలన్నారు. రైతంగాన్ని మోసం చేసే కల్తీ విత్తనాల, పురుగుల మందుల సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెళ్తురు సదానందం, గుమ్మడి వెంకన్న, రైతు సామస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లన్న బీమన్నా, మెర్గు చంద్రయ్య, రైతు సంఘం జిల్లా కన్వీనర్ తాండ్ర సదానందం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె. విశ్వనాథ్, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, టి.రత్నకుమార్, పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గోల్ల సత్తయ్య(55) వెన్నునొప్పి భరించలేక గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపినవివరాల ప్రకారం.. సత్తయ్య ఐదు సంవత్సరాల నుంచి తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి11 గంటల సమయంలో ఇంటిముందు ఉన్న 25కిలోవాట్ల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వైరును పట్టుకున్నాడు. రెండు చేతులకు తీవ్రమైన గాయాలు కాగా సత్తయ్యను కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. మృతుడు సత్తయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనం పట్టివేత

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని గుండ్లపల్లి వద్ద గన్నేరువరం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట నుంచి సిద్దిపేటకు టీఎస్28టి7996గల వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన డ్రైవర్ పల్లెచిన్న, వాహన యజమానిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

ఘాట్ రోడ్డు నిర్మాణం
పూర్తయ్యేదెన్నడో..?

- అమలుకు నోచుకోని పర్యాటక కేంద్రం హామీ
- అభివృద్ధికి దూరంగా మామిడిపల్లి సీతారామ ఆలయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పనులు ప్రారంభించి వదిలేసిన ఘాట్‌రోడ్డు, మామిడిపల్లి గుట్టపై వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి

కోనరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపల్లి సీతారాములస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వహయాంలో మరో భద్రాచలం ఆలయంగా మార్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మాట కలగానే మిగిలిపోయింది. ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు. దీంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● ఆలయానికి ప్రత్యేక గుర్తింపు..

కోనరావుపేట మండలం మామిడిపల్లి గుట్టపై వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉండడమే కాకుండా భక్తులు కొంగు బంగారంగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య జాతర, సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతాయి. వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. వేములవాడ ఆలయ ఆధీనంలో మామిడిపల్లి సీతారాముల ఆలయం కొనసాగుతోంది. గత ప్రభుత్వ పాలనలో అప్పటి ఎమ్మెల్యే రమేష్‌బాబు మరో భద్రాచలం ఆలయంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. సీతమ్మ తల్లి పర్ణశాల నిర్మాణం చేపడుతామన్న హామీ అమలుకు నోచుకోలేదు. మూడు సంవత్సరాల క్రితం కోటి 19లక్షల రూపాయలతో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ఆలయ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎలాంటి పనులు జరగడం లేదు. ఇటీవల మాఘమాసం సందర్భంగా ఎమ్మెల్యే సూచన మేరకు రెండు రోజుల పాటు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ తిరిగి అర్థంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి పనులు పూర్తయ్యేలా, ఆలయ అభివృద్ధి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చాలి..

- కృష్ణహరి, ఆలయ అర్చకులు



గత ప్రభుత్వ పాలనలో మా మిడిపల్లి సీతారామ స్వామి ఆల యాన్ని మరో భద్రాచలం ఆల యంగా మారుస్తారని హామీ ఇ చ్చారు. పర్యాటక కేంద్రంగా మా రితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా ప్రారంభించిన ఘాట్ రోడ్డు నైనా పూర్తిచేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

రేషన్ బియ్యం పట్టివేత



వాహనంలో రేషన్ బియ్యం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ చుట్టుపక్కల గ్రామాల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యం సుమారు 17 క్వింటాళ్లను వ్యాన్‌లో గుండ్లపల్లి మీదుగా సిద్దిపేటకు తరలిస్తుండగా శుక్రవారం గుండ్లపల్లిస్టేజి వద్ద గన్నేరువరం పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ బొమ్మ స్వామిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

బాలికను వేధించిన కేసులో రెండు సంవత్సరాల జైలుశిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి, అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన మహమ్మద్ అంకూస్ అనే 20సంవత్సరాల యువకుడు 2019 సంవత్సరంలో అదే మండలంలోని ఓగ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు సాగర్, కిరణ్, రాజు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ కృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి అంకూస్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

దొంగను పట్టుకున్న రాజన్న ఆలయ సిబ్బంది

వేములవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ, మున్సిపల్ ప్రాంతాల్లోని విద్యుత్ వైర్‌ను దొంగిలిస్తున్న కోరుట్ల ప్రాంతానికిచెందిన శ్రీనివాస్ అనేవ్యక్తిని ఆలయ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. తరచూ దేవస్థానానికి చెందిన జనరేటర్ సమీపంలో, ఆలయపరిసరాల్లోని విద్యుత్‌వైర్‌ను దొంగిలించి షాపులో అమ్ముతున్నట్లు సిబ్బంది గమనించారు. శుక్ర వారం కూడా వైర్‌ను దొంగిలిస్తుండగా శ్రీనివాస్‌ను పట్టుకొని చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌కు చెందిన లింగంపల్లి మొండయ్య బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లగా అక్కడే ఆయన అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కుటుంబసభ్యులు, గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన తక్షణమే స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేయగా శుక్రవారం మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్‌వర్మ, న్యాయవాది లింగంపల్లి నాగరాజు కోరారు.

అంతుచిక్కని వ్యాధితో కోళ్ల మృతి

గంగాధర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపూర్ కోళ్లఫారంలో అంతుచిక్కని వ్యాధితో బాయిలర్ కోళ్లు మృతిచెందాయి. రెండురోజులుగా కోళ్లు నీరసంగా ఉంటున్నాయి. గురువారం రాత్రి బాగానే ఉన్న కోళ్లు శుక్రవారం ఉదయం మృతిచెందాయి. మృతి చెందిన కోళ్లను పశువైద్యాధికారి పరిశీలించారు. మృతిచెందిన కోళ్లను పూడ్చి పెట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం ఉదయం సీసీఎస్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద రూ. 22,920 నగదు స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్టుచేసి వారినికోరుట్ల పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. వారివద్ద ఆరుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సినీ ఫక్కీలో చోరీ

● బ్యాంకు నుంచి డ్రాచేసిన రూ. 1.50 లక్షలు అపహరణ

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శుక్రవారం పట్టపగలు సినీఫక్కీలో చోరీజరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట శ్రీహరి అనే రైతు అతని స్నేహితుడితో కలిసి కోరుట్ల పట్టణంలోని ఎస్‌బీఐ ప్రధానబ్యాంకుకు డబ్బులు డ్రా చేయడానికి ద్విచక్రవాహనంపై వచ్చారు. బ్యాంకులోకి వెళ్లి రూ. 1,50,000 నగదు డ్రా చేసుకొని ద్విచక్ర వాహనంలో పెట్టుకున్నాడు. అప్పటికే వీరిని గమనిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు శ్రీహరి వాహనం తీస్తున్న సమయంలో మీ జేబునుంచి 100రూపాయలు కింద పడిపోయాయని ఓ వ్యక్తి చూపించాడు. వాహనంపై ఉన్న శ్రీహరి కిందికి దిగి వంద రూపాయల నోటును తీసుకునే క్రమంలో వెనుకాల ఉన్న మరో గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో ఉన్న రూ. 1,50,000 నగదును అపహరించి వారు తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారీ అయ్యారు. శ్రీహరి తేరుకొని చూసేసరికి బ్యాగులో ఉన్న నగదు కనపడకపోవడంతో బోరున విలపించాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బ్యాంకుతో పాటు పట్టణంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. అనుమానితుల సీసీ పుటేజీలను పోలీసులు విడుదల చేశారు. బాధితుడు శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులు విడుదల చేసి అనుమానితుల ఫొటో

నమిలికొండలో దొంగతనం

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన బల్లాడి లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 80వేల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకుపోయినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. బల్లాడి లక్ష్మి ఈ నెల 26న కరీంనగర్‌కు పని నిమిత్తం వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగింది. ఎవరులేని సమయంలో ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకు పోయారని బాధితురాలు పిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

అస్వస్థతకు గురైన ఉపాధి కూలీ

శంకరపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని చింతగుట్ట గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనిచేస్తూ గణపతి అనే వ్యక్తి అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. వెంటనే పనిచేస్తున్న తోటికూలీలు ఆటోలో తాడికల్ వరకు అక్కడినుంచి 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బల్యాలనగర్‌లోని ఓ పౌల్ట్రీ ఫాం వద్ద అక్రమంగా నిల్వచేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యంను శుక్రవారం పట్టుకున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. ఈ రేషన్ బియ్యంను నిల్వచేసిన కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన బుర్ర అంజయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ రైల్వేగేట్ దగ్గర 150గంజాయి అమ్ముతున్న మండలంలో పూడూర్ గ్రామానికిచెందిన ఈదురి అనోక్ పై శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. రైల్వేగేట్‌దగ్గర అనోక్ గంజాయి అమ్ముతున్నాడన్న పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసివెళ్లి అతనిని పట్టుకున్నట్లు తెలిపారు.

నిందితుడిని విచారించగా బీహార్‌కు చెందిన షరీఫ్‌అనేవ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి నట్లు ఒప్పుకున్నాడన్నారు. ఈ మేరకు అనోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొదురుపాకలో చోరీ..

బోయినపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొదురుపాక గ్రామంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలతోపాటు 24తులాల వెండిని ఎత్తుకెళ్లినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. గ్రామానికిచెందిన సట్టాజలజ ఇంటికి గడియపెట్టి తాళం వేయకుండా అంగన్‌వాడీపాఠశాలకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఇంటికి తలుపుతెరిచి ఉండడంతో అనుమానంతో బంగారు ఆభరణాలను పరిశీలించగా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ సింగరేణి ఉద్యోగి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణానికి చెందిన ఎండి. హైమద్ (51) చికిత్స పొందుతూ మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న పెద్దపల్లి పట్టణానికి చెందిన గంగిడి శ్రీనివాస్ రెడ్డి, హైమద్ ద్విచక్రవాహనంపై సింగరేణి లో విధులకు వెళ్తుండగా రాఘవపూర్ వద్ద పెద్దపల్లికి వస్తున్న ఆర్టీసీ బస్ అతివేగంతో ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. హైమద్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జూలేక బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్‌ఐ స్వామి తెలిపారు.

చారిత్రక ప్రాంతానికి
రవాణా సౌకర్యం

- మానేరు నది పాత రోడ్డుపై నూతన వంతెన నిర్మాణం
- కరీంనగర్- ఎలగందల్ మధ్య తగ్గనున్న దూరం

భగత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-ఎలగందల్ మధ్య నూతనంగా నిర్మిస్తున్న వంతెనతో చారిత్రక ప్రాంతానికి రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. కొత్తపల్లి మండలంలోని చింతకుంట, ఎలగందల్, కమాన్‌పూర్, బావుపేట, ఖాజీపూర్ గ్రామాలతో పాటు, సిరిసిల్ల వేములవాడకు వెళ్లే ప్రయాణికులకు దూరం తగ్గనున్నది. ఎల్‌ఎండి నిర్మాణంతో పాత రోడ్డు మానేరులో మునిగి పోవడంతో దశాబ్ధాలకు పైగా ఎలగందల్ గ్రామం కరీంనగర్ జిల్లా కేంద్రానికి దూరమైపోయింది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెంతనే ఉన్న ఎలగందల్ గ్రామానికి చేరుకోవాలంటే పది కిలోమీటర్లకు పైగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరీంనగర్-ఎలగందల్ గ్రామాల మధ్య మానేరు నదిపై నూతనంగా గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి పునాదులు వేశారు. బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా పూర్తి కావస్తుండడంతోఎలగందల్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరీంనగర్-సిరిసిల్ల వెళ్లాలంటే ఈ ప్రాంతంలో పాత రోడ్డు ఉండేది. ఎల్‌ఎండీ నిర్మాణంతో పాత రోడ్డు మానేరు నీటిలో మునిగి పోయింది. బ్యాక్ వాటర్‌తో పాటు, మానేరు నది నీరు పూర్తిగా ఈ చింతకుంట, ఎలగందల్ గ్రామాలకు ఆనుకుని రావడంతో ఆ రోడ్డు పూర్తిగా కనుమరుగైంది.



ఎలగందల్-కరీంనగర్ మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి

● పర్యాటకులకు సౌకర్యం

ఎలగందల్ గ్రామం ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది. గ్రామంలో ప్రాచీన కళా సంపద, కోట బురుజులు, చారిత్రాక ప్రదేశం కావడంతో బ్రిడ్జి నిర్మాణంతో పర్యాటకుల తాకిడి కూడా పెరగనున్నది. బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఈ ప్రాంత వాసులు ఏళ్లుగా కోరుతున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకురావా లని కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న ప్రజల వెతలు

- మంద రమేష్, మాజీ ఎంపిటీసీ, ఎలగందల్



కరీంనగర్-ఎలగందల్ గ్రామాల మధ్య పాత రోడ్డు ప్రాంతంలో నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. కరీంనగర్‌కు ఎలగందల్ గ్రామం దూరం తక్కువైనా బ్రిడ్జి లేకపోవడంతో చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న గ్రామానికి సరైన రవాణా లేక వెనుకబాటుకు గురైంది. బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

ప్రేమ.. పరువు... హత్య...

- కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్న యువతీ, యువకుడు
- పలుమార్లు పంచాయితీ
- కులాంతర వివాహం చేసుకుంటే పరువు పోతుందని భావించిన తండ్రి
- అదును చూసి యువకుడి హతం
- ముప్పిరితోట గ్రామంలో విషాదం
- శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో పోలీస్ పికెట్



విలపిస్తున్న సాయి కుమార్ తల్లి

పెద్దపల్లి/ఎలిగేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూతురిని ప్రేమిస్తున్నాడనే అక్కసుతో అమ్మాయి తండ్రి యువకుడి పుట్టిన రోజే పథకంప్రకారం గొడ్డలితో నరికి చంపిన ఘటన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో చోటు చేసుకున్నది. పూరేళ్ల పరుశరాములుగౌడ్-జ్యోత్స్న దంపతుల కుమారుడు సాయి కుమార్(20) రెండేళ్లక్రితం ఇంటర్మీడియెట్‌లో చేరి మధ్యలోనే ఆపేశాడు. అదే గ్రామానికి చెందిన వేరే కులానికి చెందిన అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. వీరి ప్రేమవ్యవహారం తెలుసుకున్న అమ్మాయి తండ్రి సాయికుమార్‌ను మందలించాడు. అయినప్పటికీ వారు కలుస్తుండడంతో ఈ విషయమై గ్రామంలో పంచాయితీ జరిగింది. వారు ఒకరికొకరు ఇష్టపడడంతో వివాహం చేయాలని సలహా ఇచ్చారు. ఇరు కుటుంబాలు అందుకు అంగీకరించారు. కానీ కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం తండ్రికి ఇష్టం లేదు. మరోవైపు వేరే కులానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెండ్లి చేస్తే కులంలో, గ్రామంలో పరువు పోతుందని బంధువులు పేర్కొన్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని అమ్మాయి తండ్రి యువకుడిని హతమార్చేందుకు ప్లాన్ వేశాడు.

అమ్మాయిని ప్రేమించిన పాపానికి కసాయి చేతిలో కొడుకు గొడ్డలివేటుకు గురై మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. సాయికుమార్ పుట్టిన రోజు గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన ముత్యం సది(సదయ్య) అనే వ్యక్తి గొడ్డలితో దాడిచేసి విచక్షణరహితంగా నరికి చంపాడు. అదే గ్రామానికి చెందిన యువతి, సాయికుమార్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, పెళ్ళి చేసుకుంటామని తెలిపారని మృతుడి తల్లిదండ్రులు విలపించారు. కొడుకుపై కక్షపెంచుకొని అదనుచూసి చంపాడని బోరున విలపించారు. గతంలో రెండు సార్లు హత్యాయత్నం చేశారని ఆవిషయం కులంలో చర్చించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మృతుడి తండ్రి పర్శరాలు గౌడ్ పేర్కొన్నారు. తమ కుమారుడిని హత్యచేసిన నిందుతున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు కటుంబ సభ్యులు విలపించిన తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది. గతంలో కూతురిని కోల్పోయామని ఉన్న ఒక్కగానొక్క కొడుకు హత్యకు గురయ్యాడని, తమకు దిక్కెవరంటూ రోదించారు. సంఘటన స్థలాన్ని డీసీపీ కరుణాకర్, ఏసీబీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు సనత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, స్వామి, నరేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లు పరిశీలించారు. నిందుతుడు ముత్యం సదయ్యపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

గ్రామంలో పోలీస్ పికెట్

జిల్లాలోనే సంచలనం సృష్టించిన పరువుహత్య ఘటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం రాత్రి పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరు కుటుంబాల సామాజికవర్గాలు వేర్వేరు కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ ఉన్నతాధికా రులు ముందస్తు చర్యలు చేపట్టి నిఘాను కట్టుదిట్టం చేశారు. జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు రప్పించి జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల ఎస్సైల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాన కూడళ్లు, నిందితుడు, మృతుడి ఇంటి వద్ద పోలీస్ పహారా ఏర్పాటుచేశారు. పోలీసు పహారా మధ్య శుక్రవారం సాయంత్రం సాయికుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీస్ బందోబస్తు మధ్య పోస్టుమార్టం

సుల్తానాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో హత్యకు గురైన పూరెళ్ల సాయికుమార్ మృతదేహానికి శుక్రవారం సుల్తానాబాద్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సంఘటన జరిగిన గురువారం రాత్రి నుంచి మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆస్పత్రి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు మధ్య సాయికుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ పోలీస్ అధికారులు బందోబస్తు పర్యవేక్షించారు. మధ్యాహ్నం లోగా పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి కావడంతో బందోబస్తు మధ్య మృతదేహాన్ని ముప్పిరితోటకు తరలించారు. మృతుడి బంధువులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ కు సన్నిహితులు కావడంతో పలువురు నాయకులు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.

కొబ్బరిముక్కల సేకరణకు టెండర్ ఖరారు

మల్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొబ్బరిముక్కలు పోగు చేసుకునే టెండర్ ఎట్టకేలకు ఖరారు అయింది. శుక్రవారం దేవస్థానం అధికారులు ఆన్‌లైన్, సీల్డ్, బహిరంగ వేలం నిర్వహించగా ఈ వేలంలో హెచ్చు పాటగా రూ.91,16,666 నిలువడంతో టెండర్ ఖరారు చేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనిదినాలు 200కు పెంచాలి

కరీంనగర్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల దృష్ట్యా కూలీల వేతనం కూడా రూ.300 నుంచి రూ.600 పెంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాల అనుసంధానం పేరిట 7.6 కోట్ల మందికూలీల జాబ్‌కార్డులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించిందని ఆరోపించారు. 10 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించాయని తెలిపారు.

పూడూర్‌లో రోడ్డు ప్రమాదం

● వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

కొడిమ్యాల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ఆవుల సంపత్‌కు గాయాలయ్యాయి. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ వైపు నుంచి వస్తున్న వ్యాన్‌ను డ్రైవర్ అతివేగంగా నడుపుతూ పూడూర్ గ్రామ శివారులో రెండు కార్లను, ఒక లారీని ఢీకొట్టినట్లు తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



వేసవికాలం.. వాహనాలు జాగ్రత్త

ముందు జాగ్రత్తలతోనే ప్రమాదాల నియంత్రణ

కరీంనగర్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. పగటి వేళ బయట అడుగుపెట్టాలంటే జనాలు భయపడుతున్నారు. భానుడి ప్రతాపంతో మనుషులే కాదు వాహనాలకూ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. హైదరాబాద్‌లో బుధవారం ఒక పోలీస్ వాహనంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రస్తుత వేసవి కాలంలో వాహనాల్లో ప్రయాణించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యధిక ఉష్ణోగ్రతలతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తించాలి. వాహనాల్లో ఇంజిన్, విద్యుత్ సరఫరా చేసే వైర్లలో సమస్యలు తలెత్తి మంటలు చెలరేగే అవకాశం ఉంది. వేగంగా వెళ్తున్న సమయంలో ఇతర వాహనాలను ఢీకొన్న సమయంలో పెట్రోల్, డీజిల్ లీకేజీ అయి మంటలు అంటుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో నడుస్తున్న వాహనం, నిలిపి ఉన్న వాహనాల నుంచే అకస్మాత్తుగా మంటలు వస్తాయి. వాహనాల్లోని వైరింగ్‌లో నాణ్యత లోపం, ఇంజన్ వేడెక్కడం, ఆయిల్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు అంటుకునే ప్రమాదముంది. వేసవిలో పాత వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలి. వేసవిలో వాహనాల ఇంజన్లు వేడెక్కుతుంటాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాల బారినపడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ (ఈవీ) ద్విచక్ర వాహనాలు, కార్లు వేల సంఖ్యలో నడుస్తున్నాయి. వేసవిలో ఈవీ వాహనాలు త్వరగా వేడెక్కి మంటలు అంటుకునే అవకాశాలుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈవీ వాహనాలకు చార్జింగ్ చేసే సమయంలో, ఎక్కువ దూరం వెళుతున్న సందర్భంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

వైరింగ్ నాణ్యత లోపంతో షార్ట్ సర్క్యూట్ జరుగుతుంది

- కానిగంటి రమేష్, కార్ మెకానిక్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షుడు



బైక్, కారు, జీపు, ఇతర వాహనాల్లో నాణ్యత లేని వైర్లను ఉపయోగించడంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా వాహనాల తయారీ సమయంలో దాని సామర్థ్యాన్ని తట్టుకునే విధంగా కంపెనీ వైర్ ఫిట్టింగ్ ఉంటుంది. వాహనాల్లో వైరింగ్ దెబ్బతిన్న విషయం గుర్తించకపోవడం, వైర్లు ఒకదానికి మరొకటి కలవడంతో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ గ్యాస్ లీకేజీలు గమనించకుంటే ఎండలకు ఇంజన్ వేడెక్కి హఠాత్తుగా మంటలు వ్యాపిస్తాయి. ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి.

● మంటలు వచ్చేందుకు కారణాలు

- వాహనాల్లో వాడుతున్న ఇంధనాలన్నీ ఇంజన్ ఆయిల్, పెట్రోల్, డీజిల్, గ్యాస్ మండే స్వభావం ఉన్నవి.
- వేసవిలో ఇంజన్ త్వరగా వేడెక్కుతుంది. దూర ప్రయాణంలో మధ్యలో కొంత సమయం విరామం తీసుకోవాలి.



- ఇంధనాలు ఏమాత్రం లీకైనా వేడికి మంటలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- వాహనాల్లో తక్కువ నాణ్యత వైర్లు వాడటంతో కూడా స్పార్క్ వచ్చి మంటలు అంటుకునే ప్రమాదమున్నది.
- వాహనాల్లో ఫాగ్ లైట్స్ స్టీరియో, సౌండ్స్, సెల్‌ఫోన్ చార్జర్, ఇతర డెకొరేషన్ లైట్స్ వంటివి అదనంగా బిగించడంతో వైరింగ్‌పై లోడ్ పడి దెబ్బతింటున్నాయి.
- పాత వాహనాలకు గ్యాస్‌కిట్‌లను అమర్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే లీకేజీ కారణంగా మంటలు అంటుకుంటాయి.
- షోరూం ఎల్పీజీ వర్షన్‌లో వచ్చిన కార్లు కాకుండా పాత కార్లకు తక్కువ నాణ్యత కలిగిన గ్యాస్ కిట్లు అమర్చడంతో గ్యాస్ లీకేజీతో ప్రమాదాలు జరుగుతాయి.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ప్రతి కారును నిర్దీత సమయలో సర్వీసింగ్ చేయించుకోవాలి.
- 10 వేల కిలోమీటర్లు తిరిగిన తర్వాత వాహనం ఇంజన్‌లో ఉండే ఆయిల్ ఫిల్టర్లను మార్చుకోవాలి.
- కారు నుంచి మంటలు వచ్చినప్పుడు దూరంగా ఉండాలి. అటువైపు ట్రాఫిక్ రాకుండా చూడాలి.
- వాహనంలో ఉన్నప్పుడు మంటలు, కాలుతున్న వాసన వస్తే వాహనాన్ని నిలిపివేసి తనిఖీ చేయాలి.
- మండే స్వభావం ఉన్న గ్యాస్ డబ్బాలు, ఇంధనాలు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- కారు ఇంజన్ కూలింగ్ కోసం కూలెంట్ వాటర్‌ను పోయాలి. ఇది ఇంజన్ వేడెక్కకుండా కాపాడుతుంది.



- తరచు ఇంజన్ ఉష్ణోగ్రతను తనిఖీ చేస్తుండాలి.
- గుర్తింపు పొందిన సెంటర్లలోనే వాహనాలను సర్వీసింగ్ చేయించాలి.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముత్తారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన రొయ్యల రాజకుమార్(26) పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. రొయ్యల రాజకుమార్ ఓ దినపత్రికకు రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కాగా గ్రామానికి చెందిన ఒకరి వద్ద రూ.లక్ష అప్పుచేశాడు. అందులో రూ.50వేలు చెల్లించాడు. మద్యం మానేసి మిగతా అప్పుచెల్లించాలని తల్లి కొమురమ్మ రాజకుమార్‌ను మందలించింది. ఈనెల 17న మద్యంలో పురుగులమందు కలుపుకొని తాగి ఇంటికి వచ్చి తల్లికి తెలిపాడు. దీంతో హుటాహుటిన కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి అనంతరం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

పెంచికలపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం ఉదయం ఎల్కపల్లి పెట్రోల్‌పంపు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరుమండలం మర్తిడి గ్రామంనుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సంతకు తరలిస్తున్న ఐదు ఎద్దులు, రెండు దున్నపోతులను తరలిస్తున్న వాహనాన్ని సమాచారం మేరకు పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న కరీంనగర్‌కు చెందిన జాఫర్, అహ్మద్ రఫీ, బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలం అనే ముగ్గురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

పెద్దపల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన కొంతం శ్రావణ్ కమాన్ నుంచి జెండా చౌరస్తాకు బైక్‌పై వెళ్తుండగా మొబైల్ పడిపోయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవికాంత్‌కు అది దొరకగా ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. శ్రావణ్‌కు సెల్‌ఫోన్ అందజేశాడు.

అగ్నిప్రమాదాలపై ఆర్టీసీ డిపోలో అవగాహన



ఆర్టీసీ డిపో-2లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిదృష్ట్యా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన రక్షణచర్యలపై కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారులు గురువారం ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిమాపక అధికారి సుల్తాన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిపోలో ఎలక్ట్రిక్ బస్సులతోపాటు ఇతర బస్సులున్నాయని, వేసవిలో ఇంజన్ వేడెక్కి మంటలు అంటుకునే ప్రమాదముందని అన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ బస్సులడ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణచర్యలపై అగ్నిమాపకశాఖ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఏఈ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద విరిగిన హైట్ గేజ్

● మరమ్మతు చేసిన అధికారులు



రైల్వే గేటు వద్ద విగిన హైట్ గేజ్

కరీంనగర్ రూరల్; మార్చి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారిపై రైల్వే గేటు వద్ద భారీ చేసిన హైట్ గేజ్ విరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం రెడ్ మిక్స్ వాహనం పైప్పు తాకడంతో విద్యుత్ లైన్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన హైట్ గేజ్‌విరిగింది. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అధికారులు మరమ్మతు చేపట్టారు. మరమ్మతుచేసే సమయంలో ట్రాఫిక్‌జామ్‌తో అవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఆర్టీసీ జోనల్ ఆస్పత్రి తనిఖీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ గిరిసింహారావు

భగత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ జోనల్ ఆస్పత్రిని జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ పరికరాలను పరిశీలించారు. అనంతరం వేసవిలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ బీవీ రావు, జోనల్ వర్క్ షాప్ మేనేజర్ సుగుణాకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్.మధుసూదన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులలో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ

● 31675.47 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో తేడా ● అధికారులతో యజమాని వాగ్వాదం

మంథని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి శ్రీలక్ష్మి మాడ్రన్ రైస్‌మిల్లుకు అనుబంధంగా ఉన్న గంగాపురిలోని సత్యసాయి పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో నిల్వలపై సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారంతనిఖీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎఫ్‌సీఐ అధికారులు శ్రీలక్ష్మి పారాబాయిల్డ్, రైస్‌మిల్‌లో తనిఖీలు నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం, బియ్యంనిల్వ2023-24 సంవత్సరానికిగాను ఎఫ్‌సీఐకి సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వలపై అధికారులు తనిఖీలు చేశారు. గంగాపురిలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా 41,365.27 క్వింటాళ్ల ధాన్యంకు గాను 9689.8 క్వింటాళ్లు మాత్రమే లెక్కలోకి వచ్చాయి. మిగితా 31675.47 క్వింటాళ్ల ధాన్యం స్వాహా అయినట్లు అధికారులు గుర్తించారు. తనిఖీ చేస్తున్న అధికారులతో మిల్లు యజమాని పొల్లాల సత్యనారాయణ వాగ్వాదానికి దిగాడు. తనిఖీల పై సివిల్ సప్లై టాస్కుఫోర్సు ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. తనిఖీల్లో 31675.47 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా వచ్చినట్లు తెలిపారు. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 19,339 క్వింటాళ్ల ధాన్యం, బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించామని పెద్దపల్లి గోదాం మేనేజర్ వెంకటేష్‌సాగర్ తెలిపారు. నిల్వఉన్న బ్యాగ్‌లు మాత్రం వేరుగా ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తనిఖీలపై రైస్‌మిల్లు యాజమాని సత్యనారాయణ మాట్లాడుతూ. మిల్లులో 2024 డిసెంబర్ 31 లోగా టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ ధాన్యం నిల్వలు తీసుకెళ్లాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ధాన్యం తీసుకెళ్లక పోవడం వాళ్ల తప్పే అన్నారు. తనిఖీలో ఎలాంటి తేడాలు వచ్చిన హైకోర్టు ఉత్తర్వుల మేరకు డబ్బులు చెల్లించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఎస్‌ఐ జంగయ్య, డీటీ సంతోష్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మిల్లు యజమాని

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయానికి శుక్రవారం భక్తులు తరలివచ్చి ఆలయకల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు.

అగ్రహారం అంజన్న హుండీ లెక్కింపు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన అగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయ హుండీలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఓపెన్ ప్లేస్‌లో ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు నెలల హుండీలను విప్పి లెక్కించగా ఆలయ ఖజానాకు రూ. 2 లక్షల 3 వేల 292 నగదు ఆదాయ సమకూరినట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ ఉద్యోగులు వంశీయ ధర్మకర్త మహేందర్, దేవాదాయ శాఖ పరిశీలకుడు రాజమౌళి, సత్యసాయిసేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

జయంతి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

● కొండగట్టులో పరిశీలన



కొండపైన అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలోజరిగే హనుమాన్ చిన్నజయంతి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. గతశనివారం జిల్లా కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం అడిషనల్ కలెక్టర్ కొండగట్టులో పర్యటించారు. జయంతికి చేపట్టిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు, ఆలయఅర్చకులతో కలిసి కొండపైన ఆలయప్రాంతం, కోనేరు, వైజంక్షన్‌తదితరప్రాంతాలను పరిశీలించారు. కొండపైకివచ్చే భక్తులు, జయంతికి తరలివచ్చే దీక్ష స్వాములు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అడిషనల్‌కలెక్టర్ వెంట ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆర్డీవోమధుసూదన్, స్థానాచార్యులు కపీందర్, దేవస్థానం పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి ఇతర అధికారులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టుపల్లి శివారు వద్ద అక్రమంగా తరలిస్తున్న 12క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. అడవి సోమన్‌పల్లి గ్రామానికి చెందిన గొంతినర్సయ్య అనేవ్యక్తి ట్రాలీ ఆటోలో 12క్వింటాళ్ల బియ్యాన్నిఅక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ నర్సయ్యను విచారించగా అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన వేముల మహేష్ చెప్పిన విధంగా మహారాష్ట్రలోని సిర్వోంచకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇంటర్‌లో హెచ్‌సీఈసీ కోర్సు ప్రవేశపెట్టాలి

● చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఆర్ట్స్‌విభాగంలో హెచ్‌సీఈసీ (చరిత్ర, కామర్స్, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం) కోర్సు ప్రవేశపెట్టాల్సిన అవసరముందని చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో చరిత్ర జూనియర్ లెక్చరర్ల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోతరవేణి తిరుపతి హాజరై మాట్లాడారు. 1976 సంవత్సరంలో ఇంటర్ విద్యలో ప్రవేశపెట్టిన సాంప్రదాయ కోర్సులే ఇప్పటికీ కొనసాగడం శోచనీయమన్నారు. అధునిక అవసరాలకు తగ్గట్టుగా సాంప్రదాయ ఆర్ట్స్ కోర్సులైన హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులను కలిపి హెచ్‌సీఈసీతో నూతన కోర్సు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లాచరిత్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొత్తూరి మహేశ్ కుమార్, చరిత్ర జూనియర్ లెక్చరర్లు సుదర్శన్, నరేశ్, రామ్ ప్రసాద్, దేవేందర్, నిర్మల, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి

పేపర్ బ్యాగుల తయారీపై విద్యార్థులకు శిక్షణ



పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు అంజయ్య

చందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ.. ప్లాస్టిక్ వినియోగం నివారణలో భాగంగా వ్యర్థ పేపర్లను వినియోగించి పేపర్ బ్యాగులు, పేపర్ ఫైల్ తయారు చేయడంలో ఉపాధ్యాయుడు మేడికాల అంజయ్య విద్యార్థులకు రెండు రోజులు శిక్షణ ఇచ్చాడు. విద్యార్థులు పలు రకాల బ్యాగులు, వివిధ రకాల పత్రాలు భద్రపరచుకోవడానికి పేపర్ ఫైళ్లను తయారు చేసి ప్రదర్శించారు. ప్లాస్టిక్ బదులుగా పేపర్ బ్యాగ్‌లు, పేపర్ ఫైల్ వాడుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అంజయ్య మాట్లాడుతూ త్వరగా మట్టిలో కలిసిపోయే పేపర్ బ్యాగ్‌లు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని, వీటితయారీకి ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పిస్తే భావితరాలకు కలుష్య రహిత, ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. ప్లాస్టిక్ వలన మనదేశంలో ప్రతి యేటా లక్షలాది మంది క్యాన్సర్ బారినపడుతున్నారని, ప్లాస్టిక్ వాడకం తగ్గించి పేపర్ బ్యాగ్‌లు,జూట్,బట్టసంచులను వాడాలని పిలుపునిచ్చాడు.

ఈ సందర్భంగా శిక్షణఅందించిన అంజయ్యను ప్రధానోపాధ్యాయులతోపాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, రాజు, ఉపాధ్యాయులు జావీద్, మహేశ్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘం బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ సంపత్

పెద్దపల్లి రూరల్, మార్చి 28 (ఆంధ్రప్రభ): పెద్దపల్లి మండలం అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ చింతపండు సంపత్ తెలిపారు. సొసైటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించి సభ్యులు, రైతుల సమక్షంలో తీర్మానించారు. బంగారు ఆభరణాలపై రుణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కేయూఎస్ఎం కింద రూ.3 కోట్లతో అప్పన్నపేట సొసైటీ ద్వారా సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమైనట్లు తెలిపారు. రాఘవాపూర్ రెవెన్యూ శివారులో సోలార్ ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. రాగినేడు - కనగర్తి శివారులోని సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సంఘంలో సభ్యుడు రుణం తీసుకొని బకాయి ఉన్న సమయంలో మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 వేలు ఇచ్చేందుకు ఆమోదించినట్లు తెలిపారు. ప్రస్తుత వేసవిలో కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

బీమా సొమ్ము పంపిణీ

సంఘంలో సభ్యులుగా ఉండి ఇటీవల మృతిచెందిన బ్రాహ్మణపల్లికి చెందిన దాసరి శివప్రసాద్ భార్య సుమలతకు రూ.లక్ష, పెద్దపల్లికి చెందిన రాపెల్లి లక్ష్మయ్య మృతిచెందగా అతని భార్య భారతికి రూ.లక్ష బీమా చెక్కులను సింగిల్ విండో చైర్మన్ సంపత్ అందించారు. సంఘం పరిధిలోని 15 మంది సభ్యులకు దీర్ఘకాలిక రుణాల కింద రూ.82 లక్షలను అందించినట్లు తెలిపారు. ఉత్తమ రైతు అవార్డు పొందిన కాసులపల్లికి చెందిన ఎర్రం మల్లారెడ్డి, ఏఈవో పూర్ణచందర్‌లు సన్మానించారు. సీఈవో తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ సోమ చంద్రయ్య, పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ పాఠశాల అనుమతి రద్దు చేయాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చీకురాయి రోడ్డులో ఉన్న సెయింట్‌ఆన్స్ పాఠశాల అనుమతి రద్దు చేయాలని శుక్రవారం కలెక్టర్, డీఈవోకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ నెల 24న హనుమాన్ మాల ధరించిన విద్యార్థిని స్కూల్ నుంచి బయటకు పంపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేసి పాఠశాల అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కడారి అశోక్ రావు, పల్లె సదానందం వెల్లంపల్లి శ్రీనివాసరావు, మౌటం నర్సింగం, మహేందర్ అమర్‌గారి ప్రదీప్ తదితరులు కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేశారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్ష

పెద్దపల్లి కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి భౌతిక రసాయన శాస్త్రం పరీక్షకు 99.9శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడ ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదని అన్నారు.

జాతరలో దుకాణాల వేలం

జూలపల్లి మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతరను పురస్కరించుకుని దుకాణాల ఏర్పాటుకు శుక్రవారం ఆలయ ఈవో సదయ్య వేలం నిర్వహించారు. ఏప్రిల్ 13న జరిగే జాతర సందర్భంగా దుకాణాలు, కూల్ డ్రింక్స్, కొబ్బరికాయలు, లడ్డూ పులిహోర, తైబజార్ తదితర వాటికి వేలం నిర్వహించారు. లడ్డూపులిహోరాకు రూ.1లక్షా 62వేలు, కొబ్బరి కాయలు రూ.70వేలు తైబజార్ రూ.31,500, కొబ్బరి ముక్కలు రూ.36వేలు, కూల్‌డ్రింక్సు రూ.8,500, మొత్తంగా 3లక్షల 8వేలు వేలంలో ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు.

ఎన్టీపీసీలో ట్రాన్స్‌జెండర్ల నిరసన



ఎన్టీపీసీలో నిరసన వ్యక్తం చేస్తున్న ట్రాన్స్ జెండర్లు

జ్యోతినగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తమను కించ పరిచే విధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో వ్యవహరించారని ఆరోపిస్తూ శుక్రవారం రాత్రి ఎన్టీపీసీలో ట్రాన్స్‌జెండర్ల కమిటీ గోదావరిఖని సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. మేడిపల్లి సెంటరులో బీఆర్ఎస్ నాయకులకు వ్యతి రేకంగా నినాదాలు చేశారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో మంత్రి శ్రీధర్‌బాబు ట్రాన్స్ జెండర్ల గురించి మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాం త్‌రెడ్డి, హరీశ్‌రావు తమను అవమానిస్తూ హేళనగా నవ్వా రని ఆ సంఘం సభ్యురాళ్లు శివాని, భవాని, సమ్మక్క, సీతారామ లక్ష్మి, లాస్యసుశ్మ, అనిత, శ్రీదుర్గ, గాయత్రి, అపరంజి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ గతంలో 10 ఏళ్లు అధికారంలో ఉండి ట్రాన్స్‌జెండర్లకు ఏమీ చేయలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఉచిత బస్సు ప్రయా ణం ఇతర సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. తమను అవ మానించేలా ప్రవర్తించిన బీఆర్ఎస్ నాయకులు తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

108లో ప్రసవం

కళ్యాణ్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సప్తగిరికాలనీకి చెందిన గర్భిణి బండి పద్మకు 108 సిబ్బంది ప్రసవం చేశారు. శుక్రవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో 108అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది గర్భిణి ఇంటికి చేరుకునే సరికే సమయం మించిపోవడంతో ఈఆర్‌సీపీ డాక్టర్ సూచన మేరకు గర్భిణీకి ఇంటి వద్దనే సాధారణ ప్రసవం చేశా రు. పద్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది ఈఎంటీ రవీందర్, పైలట్ రాజేందర్‌కు పద్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గుండె జబ్బులపై అప్రమత్తత అవసరం

ఫైటింక్లయిన్‌కాలనీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పేర్కొన్నా రు. శుక్రవారం హనుమాన్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ కొంద్ర స్టాలిన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె నిర్ధారణ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వయస్సుతో సంబంధం లేకుండా గుండె జబ్బు వస్తున్నట్లు తెలిపారు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు వంటివి ప్రభావం చూపుతున్నాయని పుట్ట మధు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన స్టాలిన్‌గౌడ్‌ను పుట్ట మధుకర్ అభినందించారు. కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈకార్యక్రమంలో మూకిరి రాజు, గుడెల్లి రాంచందర్, మారెపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన

ఫైటింక్లయిన్‌కాలనీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం పర్సనల్ లాబోర్డు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ముస్లింలు నిరసనను వ్యక్తం చేశారు. కాలనీలోని జామ మజీద్‌లో నల్ల బ్యాడ్జీలు, నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలనే కుట్రతో కేంద్ర ప్రభుత్వం బిల్లును అమలు చేసే యత్నం చేస్తున్నట్లు మజీద్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నిరసనలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అయాజుద్దీన్, ఇమామ్ రఫీక్ అహ్మద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అంతర్గాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా తహసీల్దార్, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్ శుక్రవారం ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ సతీష్ రావు, గిర్దావర్లు శ్రీమాన్, రమేష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

కోల్‌సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో 32 ఏళ్లుగా సేవ చేస్తున్న తనకు రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి ఇప్పించాలని రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో జరుగుతున్న డీసీసీ అధ్యక్షులు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశానికి హాజరయ్యారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మూడు సార్లు కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పని చేశానని, ప్రస్తుతం ఐదేళ్లుగా రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ఇఫ్తార్‌విందు ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో మాట్లాడుతూ రంజాన్ మాసం, ఉపవాసదీక్షలో ఉండే ముస్లిం సోదరులకోసం ఏర్పాటుచేసి ఇఫ్తార్‌విందు ఆత్మీయత మతసామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మతాలు చెప్పేది ఒకటేనని మనుషులంతా సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. పెద్ద మజీద్ ఇమామ్‌సాబ్‌మౌలానాఅజీమోద్దీన్, పలువురు ఇమామ్‌లు ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): రంజాన్‌పర్వదినం పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. మండలకేంద్రంలోని మజీదులో ముస్లీం సోద రులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రేస్ పార్టీ నాయకులు మస్రత్, లోక జలపతిరెడ్డి, బండి స్వామి, మల్లెత్తుల కొమురయ్య, ఎండి ఎషానుల్లా, షాబొద్దీన్, పకీర్‌మహమ్మద్, ఎండి గౌస్‌పాషా, చాందుపాషా, రఫీక్‌పాషా, వజల్ పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గం ఏర్పాటు

ధర్మారం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) ఖిలా వనపర్తిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆల య కమిటీ చైర్మన్‌గా పోలుదాసరి సంతోష్ నియమితులయ్యారు. సభ్యులుగా నూనె లక్ష్మీ, జక్కుల మానస, సాగంటి సంతోష్, జంగిలి రాజు, మల్లెత్తుల సంతోష్, కాసిపాక అశోక్‌లు నియమితులయ్యారు. ఎండోమెంట్ శాఖ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన చైర్మన్ సంతోష్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సంతోష్‌ను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, ఏఎంసీ మాజీ చైర్మెన్ కొత్త నర్సింహులు పాల్గొన్నారు.

3వ రోజుకు చేరిన రిలే దీక్షలు

కోల్‌సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో హత్యకు గురైన న్యాయవాది ఇజ్రాయెల్ ఘటనను నిరసిస్తూ గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 3వ రోజుకు చేరుకుంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ఫోన్‌లో న్యాయవాదులతో మాట్లాడారు. దీక్షకు మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతును ప్రకటించారు. సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించారు.

ఎక్స్‌కావేటర్, మట్టి కుప్పలు సీజ్

పెద్దపల్లి రూరల్ , మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామ చెరువు వద్ద డంప్ చేసిన మట్టిని అక్రమంగా తరలిస్తుండడంతో పలువురి ఫిర్యాదు మేరకు మైనింగ్ శాఖ అధికారులు అక్రమార్కులపై కొరడా ఝులిపించారు. శుక్రవారం జిల్లా మైనింగ్ శాఖ అధికారి శ్రీనివాస్ కొత్తపల్లి చెరువు వద్దకు చేరుకొని నిల్వ చేసిన ఆరు మట్టి కుప్పలను, ఎక్స్‌కావేటర్‌ను సీజ్ చేశారు.ఈ సందర్భంగా మైనింగ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ 2022లో కొత్తపల్లి ఊరచెరువులో ఆరు ఇటుక బట్టీల యజమానులు అనుమతులు కోసం దరఖాస్తు చేసుకోగా మట్టి తవ్వకాలకు మే 2022లో అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అనుమతులకు మించి మట్టిని తీసి డంప్ చేసుకున్నారని, అదనంగా మట్టిని తవ్వినందుకు జరిమానా విధిస్తున్నట్లు నోటీసులు అందించిన చెల్లించలేదని అన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తే ఉపేక్షించేది లేదని, మట్టి కుప్పల వద్ద గ్రామ పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పార్కుల్లో పచ్చదనం పునరుద్ధరణకు చర్యలు

కోల్‌సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పార్కులు, పట్టణ ప్రకృతి వనాలు, మియావాకి ఉద్యానవనాల్లో పచ్చదనం పునరుద్ధరణకుచర్యలు తీసుకోవాలని కమిషనర్ అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలో ఇందిరమ్మకాలనీ, దుర్గానగర్, గౌతమి నగర్‌లోని పార్కులను ఆమె పరిశీలించారు. పార్కుల నిర్వహణకు సంబంధించి త్వరితగతిన అంచనాలు రూపొందించి తనకు సమర్పించాలన్నారు. గ్రీన్ బడ్జెట్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగరంలో నల్లాల ద్వారా ప్రతి రోజు మంచినీటి సరఫరా జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నామని, భీమునిపట్నం, ఎన్టీపీసీ, ఎల్కలపల్లి గేట్, మారేడుపాకల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంట ఈఈ రామన్, డీఈ షాబాద్, ఏఈ తేజస్విని ఉన్నారు.

ప్రభుత్వ భూమి రక్షణకు బోర్డుల ఏర్పాటు

ధర్మారం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సర్వేనంబరు 476లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమి రక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. గత నెల 21న, ఆంధ్రజ్యోతిలో "ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం" అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. అదనంగా ఉన్న స్థలంపై వివరణ కోరుతూ దాదాపు వంద నుంచి రెండు వందల మందికి నోటీసులను జారీ చేశారు. దీనితోపాటు ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టరిత్యా చర్యలు ఉంటాయనే బోర్డులను ఏర్పాటు చేశారు. సర్వే నంబరులో 2 ఎకరాల 5 గుంటల భూమి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు.



గుర్తింపు సంఘంలో ఆర్‌జీ-1 యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశం



సమావేశంలో జీఎం,ఏఐటీయూసీ ప్రతినిధులు, అధికారులు

గోదావరిఖని, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 యాజమాన్యం శుక్రవారం జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో, అధికారులతో జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు వివిధ సమస్యలపై చర్చించారు. జీడీకే 1ఇంక్లైన్‌లో 12వ లెవల్ వరకు ఏర్పాటు చేయాల్సిన మ్యాన్‌రైడింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. ఓసీపీ-5లో ఎక్స్‌ప్లోజివ్స్‌ను ట్రాన్స్‌పోర్టు చేసేందుకు వ్యాను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జీఎం కాలనీ మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. బిట్ షార్పనర్‌లకు డస్ట్ అలవెన్స్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీడీకే 11 ఇంక్లైన్‌లో సపోర్ట్‌మెన్, లైన్‌మెన్, టిండాల్ మొఖద్దం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని అన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రీషన్లు, ఫిట్టర్లు చాలా తక్కువగా ఉన్నందున భర్తీ చేయాలన్నారు. జీడీకే 2ఇంక్లైన్ ఓవర్‌మెన్ రూమ్‌లలో కంప్యూటర్లు, కూలర్లు, ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ప్రతినిధులు మడ్డి ఎల్లయ్య, అరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, డీజీఎం(పర్సనల్) కిరణ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.


భద్రతతో లక్ష్యాలను సాధించాలి



వ్యూ పాయింట్ నుంచి క్వారీని పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణ

రామగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. ఆర్జీ-3 ఏరి యాలోని ఓసీపీ-2 గనిని శుక్రవారం పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించి ఉత్పత్తికి ఆటకం కల్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గని ఉత్పత్తి, రవాణా, యాంత్రాల వినియోగం తదితర వివరాలను తెలుసుకున్నారు. వ్యూ పాయింట్ నుంచి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. యంత్రాల వినియోగంతోపాటు నిర్దేశించిన లక్ష్యా లను సాధించేందుకు రూపొందించిన ప్రణాళికలు, తీసుకుంటున్న భద్రతా చర్య లను జీఎం ఆయనకు వివరించారు. అంతకుముందు జీఎం నరేంద్ర సుధాకర్‌రావు, అధికారులు స్వాగతం పలికా రు. అధికారులు రఘుపతి, చంద్రశేఖర్, రామారావు, ఐలయ్య, శబిరోద్దీన్, శ్రీనివాస్, శ్యామల, రవీందర్‌లు పాల్గొన్నారు.

వకీల్‌పల్లె గని తనిఖీ



గనిలోకి దిగుతున్న డీడీఎంఎస్ వెంకన్న

ఫైటింక్లయిన్‌కాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలోని వకీల్‌పల్లె గనిని డిప్యూటీ డైరెక్టర్ మైన్ సేఫ్టీ (మైనింగ్) బానోతు వెంకన్న శుక్రవారం తనిఖీ చేశారు. ప్రాజెక్టు ఆఫీస్‌లో సర్వే మ్యాప్ ద్వారా గనిలోని పని స్థలాలను పరిశీలించారు. గనిలో వినియోగిస్తున్న సాంకేతికత వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గనిలోకి దిగి బొగ్గు వెలికితీత పనులను పరిశీలించారు. గనిలో కంటిన్యూస్ మైనర్ ఎల్‌హెచ్‌డీ స్థలాలను తనిఖీ చేశారు. వీకేపీ ప్రాజెక్టు ఆఫీసర్ నెహ్రూ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్, గని మేనేజర్ రవికిరణ్, సర్వేయర్ రహమత్‌అలీ ఉన్నారు.

'కార్మికుల ప్రాణాలను హరిస్తున్న అధికారులు'

ఫైటింక్లయిన్ కాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొందరు సింగరేణి అధికారులు కమీషన్ల కోసం కార్మికుల ప్రాణాలను హరిస్తున్నారని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, మంద నరసింహారావు ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర చికిత్స అందించే వస తులు లేని ఆస్పత్రిని రెఫర్ జాబితాలో చేర్చడం యాజమాన్యం చేస్తున్న తప్పిదమని తెలిపారు. ఈ నెల 26న ఓసీపీ-3కి డ్యూటీకి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయ పడ్డారని, వారిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించగా స్పెషలిస్టు వైద్యులు లేకపోవడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారని తెలిపారు. కాలు విరిగిన హైమద్ అనే కార్మికుడిని 24గంటల తర్వాత హైదరాబాద్‌కు పంపారని, హైమద్ మృతి చెంది చాలా సేపు అయినట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారని పేర్కొ న్నారు. సింగరేణి వైద్యులు, కరీంనగర్ లోని ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాకంతో కార్మికుడి ప్రాణాలు పోయాయని ఆరోపించారు. మరో కార్మికుడు శ్రీనివాసరెడ్డికి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యులను నియమిం చాలని, అన్ని రకాల సదుపాయాలు ఉన్న ఆసుపత్రులకు మాత్రమే కార్మికులను రెఫర్ చేయాలని డిమాండ్ చేశారు.

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు షురూ..

(5వ పేజీ తరువాయి)

వంద మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణానికి వందలాది టిప్పర్లతో మట్టి నింపుతున్నారు. మహా రాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే-163 నిర్మాణాన్ని కేంద్రం ప్రతిపాదించింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గ్రీన్స్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో మంచిర్యాల- వరంగల్ సెక్షన్‌విభాగంలో 2 ప్యాకేజీల్లో నేషనల్ హైవేను నిర్మిస్తున్నారు. దీంతో మహా రాష్ట్ర, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోని అనేక జిల్లాలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.

● జాతీయ రహదారి సమాచారం..

నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు గ్రీన్‌ఫీల్డు కారిడార్ నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రూ. 14,666 కోట్ల నిధులతో 405 కిలో మీటర్ల ప్రాజెక్టు పొడవుగా 199.7358 హెక్టార్ల (సుమారు 5 వందల ఎకరాలు) ప్రతిపాదిత భూ మిగా నిర్ణయించారు. 2027 ఈ రహదారిని పూర్తి చేయాలని కాలపరిమితి పెట్టుకున్నారు. తొలి ప్యా కేజ్ నిర్మాణం మంచిర్యాల నుంచి వరంగల్ వరకు, ప్యాకేజీ-2లో మంథని- రామగిరి- ముత్తారం మండలాల మీదుగా నిర్మిస్తారు. జిల్లాలో 16 గ్రామాల్లో 40 కిలో మీటర్ల రహదారి, రూ. 2,607 కోట్లు కేటాయించారు.

● బేగంపేట, పుట్టపాక వద్ద ఫ్లైఓవర్లు

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మంథని మండలం పుట్టపాక సమీ పంలో రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అలాగే రామగిరి మండలం బేగంపట వద్ద ఫ్లైఓవర్ ప్రతిపాదిందించారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా మంచిర్యాల, పెద్దపల్లితోపాటు కరీంనగర్, జయశంకర్- భూపాల పల్లి జిల్లాల ప్రజలకు నేషనల్ హైవే రహదారి అందుబాటులోకి రానుంది.

సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గం



బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న న్యాయవాదులు

సుల్తానాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. అధ్యక్షుడిగా మేకల తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం మేకల తిరుపతి రెడ్డి, పడాల శ్రీరాములు పోటీ పడగా పోలైన 41 ఓట్లలో తిరుపతి రెడ్డికి 31 ఓట్లు వచ్చాయి. దీంతో అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా భూమయ్య, ఉపాధ్యక్షుడిగా ఆవునూరి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా సామల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా చీకటి సంతోష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా బొబ్బిలి శ్యామ్, లైబ్రరీ కార్యదర్శిగా గుడ్ల వెంకటేశ్, మహిళా ప్రతినిధిగా సంధ్యారాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లక్ష్మీకాంతరెడ్డి, బాలకిషన్‌ప్రసాద్, మాడూరి ఆంజనేయులు, శ్రీనివాస్ రావు, సర్వోత్తమ్ రెడ్డి, టీకే సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్స్‌గా రమేష్, ఆవుల శివకృష్ణ, రాము, వంగల యుగేందర్‌రెడ్డి, రుద్రారపు నరసయ్య, సూర్యనారాయణలు ఎన్నికయ్యారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి, రాంపల్లిలో జరుగుతున్న డబుల్ బెడ్ రూమ్ పనులను మున్సిపల్ కమిషనర్ శుక్రవారం పరిశీలించారు కమిష నర్ మాట్లాడుతూ రోడ్లు, తాగునీటి వాటర్ ట్యాంకులు, మురికాలువలు ఇతర పనులు పూర్తి కావస్తున్నాయని ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ఏఈ సతీష్,టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాముడు పాల్గొన్నారు.

పందిళ్ల గ్రామాన్ని సందర్శించిన డీపీవో

కాల్వశ్రీరాంపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్ల గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని పలువాడలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఎనిమిది లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల గదిని పరిశీలించారు. డబుల్ రోడ్డు వేస్తుండగా పైపులైన్ లీకేజీ కావడంతో విషయాన్ని మాజీ ఎంపీటీసీ రావి సదానందం డీపీవో దృష్టికి తీసుకువెళ్లారు. పైపులైన్ లీకేజీని గమనించిన డీపీవో కలెక్టర్‌కు సమాచారం అందించి లక్ష రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు ఎంపీడీవో పూర్ణచందర్ తెలిపారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో మురికి కాలువలు శుభ్రంగా ఉంచాలన్నారు. ఎంపీఓ కిరణ్ పాల్గొన్నారు.

తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ కళాశాలలో కారణాలు లేకుండా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీఆర్ఎస్‌డీ యూత్ ప్రధాన కార్యదర్శి ఈదునూరి నర్సింగ్ కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహిళా కార్మికులను అకారణంగా విధుల నుంచి తొలగించారని, నలుగురు చేసే పనిని ఇద్దరితో చేయిస్తూ పని భారం మోపుతున్నారన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించిన పది మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక

పెద్దపల్లి కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభలు జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, సహాయ కార్యదర్శి దామెర కిరణ్‌లు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మహాసభలలో చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనగరపు రజనీకాంత్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని, ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా అర్ల సందీప్, ప్రధాన కార్యదర్శిగా జిల్లా ప్రశాంత్ ఎంపికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, సహాయకార్యదర్శులు మామిడిపెల్లి అరవింద్, కమిటీ సభ్యులుగా ఆదిత్య, రాజు, మణిరత్నం, అభిరాం, శివలను ఎన్నుకోవడం జరిగింది.

జిల్లా వ్యాప్తంగా మహిళలకు కుట్టు శిక్షణ

సుల్తానాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22 నుంచి మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నామని డీఆర్‌డీఓ కాళిందిని దేవి అన్నారు. సుల్తానాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న కేంద్రాన్ని డీఆర్‌డీఓ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 22 నుంచి 31 వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని 13 మండలాలు, అలాగే అర్బన్ ప్రాం తాల మహిళలకు మూడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టిస్తున్నట్లు వివరించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల అవగాహన ర్యాలీ

కోల్‌సిటీటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2, 3 ఆధ్వర్యంలో శుక్రవారం ఫైవింక్లయిన్ ఏరియాలో పచ్చదనం, మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్‌ఓఝా మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం పలు అంశాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. డాక్టర్ నరేష్, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.